UNIVERSAL
LIBRARY
OU_204489
UNIVERSAL
LIBRARY

# KADAMBARI



To

SIR K. V. REDDI NAIDU

K. C. I. E., D. Litt.

# కాదంబరి

## శ్రీ నాగగోపాల రావు

### కృతులు

ఆరాధన

ముక్తావళి

నాగమణి

సమీక్ష

### స్వీకృతులు

వసంతము

రసాంజలి

శుభమస్తు

# కా దం బ రి

అద్దేపల్లి నాగగోపాల రావు

# నతి

శ్రీమన్మంజుతరామలాఖిలకలా సీమంతినీ దేవి, శో
భామాధుర్య రసస్వరూపిణి, హిమాంభస్సన్నిభాకార, తే
జోమాణిక్య విరాజమాన మకుటాస్తోక ప్రభారాశి, వాక్
శ్యామాదివ్యపదారవిందయుగళిన్ ధ్యానింతు నశ్రాంతమున్

శ్రీకమనీయ గానలహరీ ముహురుద్భవ తుంగభంగ సు
శ్రీకర శీకర ప్రకరసించిత ధాతృరసాత్మ, వాక్సుధా
లోకమనోజ్ఞ రాజ్ఞి, కవిలోక జనాశ్రిత దేవవాణి, రా
శీకృతభక్తి గొల్చి నతిసేసెద తత్కరుణామృతార్థినై

"బాణోచ్ఛిష్ట మిదంజగ" త్తనుట సంభావించి, యవ్వాని గీ
ర్వాణానూనకృతి ప్రసూన మధుధారాగాంగవీచీ లస
ద్వీణామోహన గాన మెంచి; సుకలాదీవ్యత్ప్రభా భానునిన్
బాణున్ కావ్యసతీమనః ప్రసవబాణఖ్యాతు శంసించెదన్

# కాదంబరి

శ్రీ మనోహర మధురసుస్మేర రుచిర
వదనచంద్రుండు నిజకులవర్ధనుండు
దళితమాఢ్యము విదిశాభిధానపురము
పాలనము సేయు శూద్రక ప్రభువరుండు.

స్వర్ణపంజరమున చండాలదారిక
శుకకులేశుఁ దెచ్చి, శూద్రకేశు
కొలువుకూటమందు నిలిచి, రాజుకు మ్రొక్కి,
వినయ మొప్ప నిట్లు విన్నవించె.

'విదితాఖిలశాస్త్రార్థ
మ్మిది, వైశంపాయనాఖ్య నెసగెడు శుక మి
య్యది, మీరు స్వీకరించిన
మదికిని మోదమ్ముఁ గూర్చు మనుజాధీశా !'

అని పలుకు నవసరమ్మున
జనపతిముఖమై శుకమ్ము జయశబ్దంబున్
వినయమ్ముమీరఁ బలికెను
తన దక్షిణచరణ మెత్తి ధరణీపతికిన్.

వింత యొదవి దాన 'విన కుతూహలమాను
తావకీనమైన జీవచరిత,
మొదటినుండి మాకు తుదిదాక నెఱిగింపు'
మని వచించి వెండి జనవరుండు.

'నీదు దేశ మేది ? నీపుట్టు వెచ్చోట ?
కన్నవార లెవరు ? కలిగె నెట్టు
లఖిలశాస్త్ర పరిచయం బది ? పంజర
బంధితుండ వెట్లు ? పలుకు' మనియె.

అన వైశంపాయను డి
ట్లను నాజననాథుతోడ సాదరవృత్తిన్
'తనరారును వింధ్యాటవిఁ
మనుజేశ్వర ! మధ్యదేశ మణిభూషణమై !

అందగస్త్యమహాముని యాశ్రమంబు
గలదు; గౌతమీనది దానిఁ గలయఁజుట్టి
పారు, నద్దానికిని నాతిదూరమందు
వరలుచుండు నగాధ పంపాసరస్సు.

తత్సరోవర పశ్చిమతటము నందు
జీర్ణశాల్మలీవృక్షంబు సెలగుచుండు
దానిశాఖాగ్ర కోటరోదరము లందు
సుఖనివాసమ్ము సేయును శుకకులమ్ము.

అస్మదీయజనకు డర్ధాంగితో నిల్చె
నొక్క జీర్ణకోటరోదరమున;
వారికేకసుతుడ ప్రసవవేదనచేత
జనని జగతివీడి చనియె దివికి.

ఏకాకి యైన తండ్రియు
లోకమ్మును జీవనమ్ము రోసియు, భరమౌ
శోకమ్ము మ్రింగుకొంచును
నాకై వసియించువాడు నవసి విధురుడై.

కాననమ్ము క్షోభఁ గావించు కోలాహ
లమ్ము తోడ నొకదినమ్ము నందు
మృగయు లేగుదేరువృత్తి గంటిమి, తదీ
యాభిముఖుల మగుచు నరిగిమింట.

శాల్మలీపాదపము నెక్కె- శబరవృద్ధు
డొక్క-రుం డవలీల మెల్లెక్కి-నట్లు
అపగతాసూనశుకశాబకాలి నెల్ల
వసుధ పై బడు నట్లుగా విసరివైచె.

పక్షసంపుటమున రక్షించి నన్ను క
ర్తవ్యతావిమూఢతను భజించి
అట్టె నిలిచిపోయె నెట్టుకాలాడక
కొందలించి మనసు గురువరుండు.

కోటరమునుండి పాటవమ్మున లాగి
ప్రాణహీనుఁ జేసి పారవైచె
ధరణిపైన నాదు గురువరేణ్యుని, పాపి
యైన మృగయు డెంతకైనవాడు.

గురునిచరణసీమఁ జొరబాఱ మచ్ఛికో
ధరము వానితోడ ధరణిఁ బడితి
సావశేషజీవిఁ గావుట నస్మదీ
యాంగచయము చిదియనైన లేదు.

లబ్ధ జీవితాశ లావొకొలందియు
అతిపిపాస మనసు నలమటించె
అంత ననతిదూర మందున్న కొలనులో
స్నాన మాడవచ్చె హానిసుతుడు

సదయు డగుచు నన్ను జాబాలి తనయుండు
కొలని యొడ్డుఁజేర్చి, సలిలబిందు
వులను ప్రేమతోడ కొలదిగాఁ గొని తెచ్చి
నా పిపాస దీర్చి నన్ను మనిచె.

అంతపైని నన్ను నాత్మ తపోవన
భూమి జేర్చి యొక్క సీమ నిల్పి
తండ్రి కాళ్ల కెరగి, తత్సమీపంబునఁ
గూరుచుండె మునికుమార హాళి.

కించిదుపజాత కౌతూహ లాంచితుండు
సంయమీంద్రుండు మధుర ప్రశాంతదృష్టి
నన్ను గన్గొని 'యాత్మ వినయఫలంబు
లనుభవైక విముక్తంబు' లని వచించె.

'దేవా! యీతని యవినయ
భావం బది యెట్టి? దెట్లు ప్రభవించె? ఫురా
జీవితమున నెవ్వండితఁ?
డావిధముం దెలియఁజెప్పు' డనగా మునులున్.

'త్రిజగతీలలామ మవంతి దేశ మందు
వరలు నుజ్జయినీపురిఁ, బరిహృతప్ర
జాప్రపీడ తారాపీడ జనవిభుండు
నలనహుషదశరథసముం డెలమి నేలు.'

'ఆతని యమాత్యశేఖరుఁ,
డాతతకార్యైకనిపుణతాహితమతి, వి
ఖ్యాతుఁడు, శుకనాసాభిధ
భూతలదేవుండు, పరమపూజ్యుం డలరున్.

'సకలాంతఃపురతరుణీ
నికరవారిధాన్య మానినీమణి పతికిఁ
ల కలదు విలాసవతి లలి
తకలా సుచిరాభిలాషఁ దనరారు గడున్'

అవనిగలయట్టి భోగభాగ్యముల నెల్ల
నతిశయమ్ముగ రాజదంపతులు గనిరి
పుత్రగాత్రపరిష్వంగ భూరిసుఖము
నెఱుగకుండుట యొక్కటే కొఱఁతగాఁగ !

యౌవనంబతి క్రామ్యంబు నొకొలంది
ధరణిపతి కనపత్యతా తాపభరము
బెరుగజొచ్చిన దెంతయు బెద్ద దగుచు
లేబరముగాదె బిడ్డలులేని బ్రతుకు !

చనఁ గొంతకాల మాగతిఁ
గనుగొనెఁ దానొక్క రేయిఁ గలయందునఁ ద
జ్జనపతి తనసతి యానన
మునఁ జంద్రుఁడు జొచ్చురీతి శుభద మెసలారన్.

క్ష్మాతలేశుఁడు లేచి, తత్‌క్షణము నంద
పిలువనంపించి శుకనాసు కల తెఱంగు
నెఱుగ వచియింప నాలించి ధరణిసురుడు
సముపజాతహర్షుండునై "జనవరేణ్య!

నీదు ప్రజలకోర్కె నేడుగా ఫలియించె
నేటి రేయి కలను నేను గంటి;
నవని సురుఁడు కమల మస్మదీయాంగనో
త్సంగ సీమ నునిచి చనినయట్లు.

'భావి శుభసూచకములు స్వప్నంబు లగుట
దేవర కమేయశుభము సంధిల్లగలదు"
అని వచింపఁగ శుకనాసుఁ డవనిపతికి
చిఱునగవు తేట మోమున చిందివెలసె.

కతిపయదివసమ్ములు చన
క్షితిపాలకసతియు దైవకృపఁ జేసియు, నం
చితరీతి గర్భవతియై
యతులితమోదమ్ము గూర్చె నవనీపతికిన్

నెలలుతొమ్మిది గడువ, రానెలతమిన్న
పుణ్యాటనమున శుభ వేళ పుత్రుఁబడసె
అదియె దినమందు శుకనాసు నతివ కూడ
తనయునిం గాంచె నానంద మినుమడింప

సాంద్రానందము చెలఁగఁ గఁ
చంద్రాపీడుం డటంచు స్వప్నానుగతిఁ
నందనునకుఁ బేరిడె రా
జేంద్రుండును దశమదివస మే తేరంగన్

భూసురకులోచితంబగు
నాసరణియు మెరయునట్టు లాత్మజున కిడెన్
వైశంపాయన నామం
బా శుకనాసుండు హ్లాదితాత్ముం డగుచుఁ

నందనుని మనసు క్రీడా
నందములం దగులకుండ నరపతి విద్యా
మందిరము పురికి వెలుపల
సుందరముగ గూర్చెఁ బ్రజలుఁ జూపర మెచ్చఁ.

సకలవిద్యలెలమి సంపాదనము సేయు.
తన కుమారు మంత్రితనయు తోడ
నప్పగించె మంచి యాచార్యులకు నొక్క
శుభదినంబు నందు క్షోణిపతియు.

అచిరకాలమందె యఖిలవిద్యావేది
యైనవాఁడు రాజసూనుఁ డట్లె
సచివతనయుఁ డయ్యె సర్వవిద్యావేత్త
చిత్తమన్యవృత్తి హా త్తకునికి.

అంత వలాహకుం డనెడు నట్టి బలాధికృతున్ సుతుఁ ధరా
కాంతుడు తోడి తేఁ బనుపఁగన్ జనియాతఁడు సూచి దివ్యసౌ
ధాంతరు రాకుమారునకు నంజలివట్టి, 'కుమారచంద్ర! వి
న్ఫింతును రేనియాన' యని ప్రీతివినీతులు దోప నిట్లనుఁ

'నిండినది మా మనోరథనిచయ మెల్ల
వివిధశాస్త్రార్థవేది వైతివి కుమార!
గురుల యనుమతిఁ గైకొని పురికి వచ్చి
పూర్ణిమాచంద్రు పోలిక మోదమిడుము!'

ఇది యయోనిజాశ్వ మింద్రాయుధాభిఖ్య
మురుపయోధి జీవనోత్థితంబు
పతికి పారసీకపాలక ప్రహితంబు
దీని బసిచె మిమ్ము దేర నృపతి

ఆ తురంగమంబు నారోహణము సేసి
రాచనగరు జేరి రాజసుతుఁడు
కరము ప్రీతి మెరయ కైదండ గావించి
సచివతనయుతోడ సాగివచ్చి.

రాజకులంబుఁ జొచ్చి యనురక్తినిఁ దండ్రికి మ్రొక్కి యంత వి
భ్రాజితభక్తి తల్లికిని వందనముం బొనరించి పౌరకాం
తాజనమన్మథుండు శుకనాసుని గేహము సేరి నమ్రుడై
పూజ యొనర్చె మంత్రివరు, పుణ్యచరిత్ర మనోరమాసతి।

ఈలీల నెల్ల వారల
కేలికబిడ్డండు మ్రొక్కి యింద్రాయుధు పై
లోలాలకుండు యౌవన
శీలుఁడు నిజమందిరమ్ము జేరెన్ నెమ్మిన్

కైలాస నామ కంచుకి
నీలాలక పత్రలేఖ నిశితాలోకన్
కౌలూత కన్యకామణి
బాలార్కుఁడు తోఁప నతని భవనమ్మునకున్.

తోడి తెచ్చె రాకుమారక!
కడుపున నిను గన్నతల్లి గారాబముతోఁ
గడుముద్దరాలి దీనిన్
విడువక నిత్యమ్ముఁ గూతువిధమునఁ బెంచెన్.

తారాపీడ నృపాలుఁడు
కోరిక మెయి దీని బంది గొని దిగ్విజయ
శ్రీరమ్యుఁ డాత్మనగరికి
నీ రామను దెచ్చి దేవి కిమ్ముగ నిచ్చెన్.

నీ తాంబూల కరంకవాహినిగ దీనిన్ పత్రలేఖాభిధన్
మాతృశ్రీ వచనానుసారముగ ప్రేమం బొప్ప బాలింపు; నీ
చేతఃప్రీతి యొనర్పజాలినది, సంసేవించు నీలేమ, సం
ప్రీతిన్, నీడయు వోలె తోడయి ప్రవర్తించున్ కుమారాగ్రణీ!

అని ప్రబోధించి కంచుకి యరిగెనంత
నాటఁగోలెను రాజనందనవరేణ్యు
ఛాయవలె నెల్లవేళల బాయకుండఁ
బరమసంతోషమున గొల్చు పత్రలేఖ.

మంత్రిపూతవారి మహనీయమంగళ
కలశమెత్తి స్వాయముగాఁగ సుతుని
శుభతరాహమందు నభిషిక్తు గావించె
సంతసింప జనులు జనవిభుండు.

క్షితిపసూను డంత సింహాసనం బెక్కె
మేరుశృంగ మంబుజారి వోలె
తోరముగుచు మొరసె దుందుభిధ్వానంబు
వాని దిగ్జయప్రయాణశంసి.

ఆలకించి దాని నపగతాస్థానుడై
అధిపసుతుడు దిగ్జయాభిలాష
తూర్పుదిక్కుఁబట్టి తురగాధిరోహియై
చనియె మంత్రితనయు డనుగమింప.

ఆది తూర్పుదిక్కు, నాపైని దక్షిణం,
బంత పశ్చిమాశ, సంత నుత్త
రాశలందు గల్గు నఖిల దేశంబుల
గెలిచి వెలసినాడు క్షితిపసుతుఁడు

వసుమతీశసుతుడు వర్షత్రయంబులో
క్షోణివలయ మెల్ల చుట్టివచ్చి
హేమకూటధామ సామీప్యకైలాస
శైలచరుల నెల్ల లీలఁ గెల్చె.

ఎల్ల కైరాతజాతి తన్నెలమి గొల్వ
నాత్మసైన్యవిశ్రాంతికై యక్కుమారుఁ
డా సువర్ణపురంబున నక్కిరాత
వాసమున నిల్చె కతిపయవాసరములు

అట వసించుచు నొక్కనాడశ్వ మెక్కి
వేటవేడుకఁ గానకు వెడలి కాంచె
శైలశిఖరావతీర్ణుల క్ష్మాతలేశ
సుతుడు కింనరమిథునమ్ము చూపుమేర.

పౌరులు రాజసూను డనివార్యకృతగ్రహణాభిలాషతో
దూరము వెంబడించు నడి తోచి వరాచలతుంగశృంగముఁ
జేర, నివృత్తదృష్టియయి చిన్నగవుఁ పచరించి ఏటికీ
భూరినిరర్థకంబు లగు పోకడలంచుఁదలంచి వెండియుఁ

పట్టుకొన్న వీరి వచ్చునదేమిటి?
పట్టకున్న గలుగు చెట్టయేమి?
మోహమూఢబుద్ధి మున్ను వచ్చినత్రోవ
చొప్పునరయ; నరుగు టిప్పు డెల్లు?

దక్షిణాశబట్టి తరలిపోవుటతప్ప
కానరాదు వేరుగతి యొకండు
'ఆత్మకృతములైన యీ దోషముల నెంత
లేసినైన ననుభవింపవలయు

అని మరల్చి హయము, నంశుమంతుడు నభో
మధ్యగామియైన మార్తాండిగాంచి
చాల డస్సియున్న సైంధవంబును తాను
తమ పిపాస తొలగు దారిఁ గాంచ.

అనువు చింతించుచు నచ్చోటు నిచ్చోటు
మాటి మాటికి చూపు మరలఁ జూచి
పూర్వోత్తరంబగు భూభాగమునయందు
ఖండితతరుమధ్య మండలమున

అతిమనోహర మదృష్టాంత మచ్ఛోదనా
మక సరోవర రాజ మొకటి యరసి
దానిదా దక్షిణతటము నాసాదించి
వ్యపగత పల్యాణ హయము నంత

గొలనులో దింపి సంపీతసలిలఁ జేసి
ఒడలు దడియార డగ్గఱనున్న యట్టి
చెట్టుకొమ్మకు గట్టె నా క్షితిపసుతుఁడు
ధావనశ్రాంతి దేహ మింద్రాయుధంబు.

చేయిదోయి గడిగి చేకొని జలమయా
హార మింత, వెలికి నరుగుదేరి
విశ్రమించువేళ వినవచ్చె నుత్తర
తీరమందు నుండి చారుగీతి !

అనుపమవీణాతంత్రీ
స్వనమిశ్రితమధురకంఠసంజాతరవం
బనిమిష గానసుధామృత
మును గుత్సుకబంటి గ్రోలి ముదితాత్ముండునై.

అధిపసుతుండు పశ్చిమపుటాశం జనంజన కొంతదవ్వు త
న్మధురరవంబు డగ్గరె, క్రమంబుగ నింకొకకొంత యేగి, చం
ద్రధరు విశాలనిర్జన పురాయతనంబును జూచి, లోనికిన్
పదపడి పోయి కాంచె భగవంతుం జతుర్ముఖుం డ్ర్యంబకేశ్వరుం.

మహనీయహిమపూర మంజులాత్మశరీర
రేఖాప్రకాశ పూర్ణేందువదన
త్ర్యంబకేశ్వర దేవతర్పణాసంత స
ద్బ్రహ్మసనాసీన బ్రహ్మసూత్ర

ఆనందపారవశ్యాస్ఫాలితానల్ప
తంత్రీస్వనోద్యదుదారచరిత
సర్జితాహంకార నిర్మమ ప్రతిపన్న
పాశుపతవ్రత భవ్యశీల

పూర్తియొనరించి సంగీతమును, ప్రదక్షి
ణమును గావించి, శివుని వందనముఁజేసి,
పహాన మూనిన ప్రాయంపుచాన గనియె
నధిక విస్మితచిత్తు డయ్యాధిపసుతుఁడు.

"స్వాగతం బతిథికి, మహాభాగ! ఈ ప్ర
దేశమున కెట్లు మీరరుదెంచినారు?
ఎట్టులో మీర లిటుజేరి రింక లెందు
అస్మదీయాతిథేయమ్ము లందుకొండు!"

అతిమధురమ్ముగా నటుల నాయమ పిల్వగ వెంటనేగి, తా
నతిథిసపర్యలన్ బడసి, యాశ్రిమసీమ సుఖోపవిష్టుఁడౌ
క్షితిపకుమారు డా నడిగె ఖేచరకామిని యైన యా కృపా
వతి 'వినిపింతురే పరమపావన! ఆత్మకథాప్రసంగముల్!'

అనిన దిగ్జయమ్ము నారంభమును జేసి
స్వీయచరిత మెల్ల చెప్పి, ఆమె
నలిపి భోజనమ్ము, సంధ్యోచితాచార
ములను దీర్చి, యొక్కశిలనుఁ జేర

అవనిప్రజకు సహజమైనట్టి లఘుబుద్ధి
నన్ను వేగిరింప నిన్ను నొక్క-
ప్రశ్నవైచువాడ భగవతీ! సంప్రీతి
నోపి నాదు శంక వాపవలయు.

నీ వయస్సదేడ ? లావణ్య మది యేడ ?
నీ స్వరూప మేడ ! నీవు నేడ ?
ఏలగొంటి భగవతీ ! సంయమిత్వంబు
ప్రాయమందు శైవవ్రత మిదేల ?

అనిన విని యామె రాజనందనున కనియె
భారతోర్వికి నుత్తరవసుధ యందు
కింపురుష నామ వర్షము సొంపుమీరు
హేమకూట నగంబు తత్సీమ వెలయు.

అందు గంధర్వపతి హంసు డలరుచుండు
నప్సరోఽంగన గౌరి బెండ్లాడె నతఁడు
తన్మహాత్ముల కేకైక తనయ నగుచు
శోకమూలక మైతి నస్తోక సరణి.

పాల పొంగులు పోలు యౌవనపు మిసిమి
హారి నీహారవారిపూరాతి ధవళ
దేహమున దోచె నా జగదేకధన్వి
యేలుకొనసాగె చిత్తమ్ము నిచ్చకొలది.

చనియు నొక్కనాడు జననితో నచ్ఛోద
సరసి జలము లందు స్నానమాడ
అతిమనోజ్ఞమైన యా సరోవర తీర
తలము లందు నెలమి చెలియ గలిసి

ఇమ్ముగ నిందునందు చరియించుచు నుండెడువేళ నొక్కచో
కమ్మని పూవుతావియది గ్రమ్ముకొనెన్ మము, 'నీ ప్రసూనగం
ధ మ్మౌరా! యనన్య' మని దాని దెసం జని గంటి నాతి దూ
రమ్మున సంయమీంద్రసుతు రమ్యతరాకృతిఁ దివ్యదీధితున్

తనకుదగినరూపు తనయంత ప్రాయంబు
గలుగువాని తపసికులము వాని
అనుగమించి స్నానమాచరింపగ నేగు
నతసి జూచి నంత యవశనైతి!

వాని కర్ణావతంసమై వరలునట్టి
కుసుమమంజరి జూచి మున్ గుబులుకొన్న
కొన్నినల తావి పీనిదేయన్న తలపు
లందు దవిలియు మదియున్న యవసరమున

భువనైకధన్వి చేతో
భవుండు, రూపైకపక్షపాతి, విరాజ
న్నవనవయౌవన సులభుఁడు,
భవారి నను జేసివైచె పరవశురాలిఁ.

వాతాహతి దీపిక వలె
చేతం బతిచపలవృత్తి చేకొనియె మనో
జాతుని చాతుర్యం బది
యా తపసికి మ్రొక్కువేళ నలసితి మిగులన్

ఏ మునిలోకచంద్రసుతుఁడీతఁడు? పేరది యేమి? మంజులం
బౌ మహనీయు కర్ణమునయందు విరాజిలు పుష్పమంజరీ
నామ మదేమి? యంచు మునినందనమిత్రుని తత్సమీపపుఁ
సీమకు జేరి, వందనము సేసి, ప్రియమ్మున పృచ్ఛ జేసినన్

తపసినూనుఁ డంత దరహాస మొనరించి
పలికె నిట్లు తేనె లొలుకునట్లు
దివ్యలోకవాసి త్రిభువనసౌందర్య
మూర్తి శ్వేతకేతు ముని కలండు.

గగనగంగ యందు దిగువేళ నమ్మౌని
రేనిఁ జూచె పుండరీకనిలయ
సాగరేశుతనయ. సద్యోభిజాతుండు
పుండరీక నామ పుణ్యుఁడితఁడు.

పారిజాత మధుర వనజమంజరి యద్ది
నే కపింజలుండ, స్నేహితుండ
నని వచించువేళ మునినందనుఁడు "గృహ్యా
తామియ"మ్మటంచుఁ బ్రేమమీర.

శ్రవణసీమ దాని సవరించు నావేళ
హస్తగళితమైన యక్షమాల
మునిసుతుండు గనడు. భూతలప్రాప్తంబు
గాకమున్న దాని స్వీకరించి.

మామకీనకంఠసీమ యందున దాల్చి
పరమహర్ష జలధిఁ బరగువేళ
"భర్తృదారికా ! భవజ్జనయిత్రి స్నా
నంబు జేసె, రమ్ము స్నానమాడ"

అను పిలుపొంఘు వచ్చిన రయంబున నంబువులందు జొచ్చి, మ
జ్జనవిధి దీర్చి, మజ్జనని సాయముగా వినువీధి నింటికిన్
జనుచు మునీంద్రనందనుని చారుమనోహరమూర్తియందు హ
త్తినమదిఁ జింతజేసితిని తీరనికోర్కెఁ దదీయగాథలన్.

రవియుఁ బొంకపుఁ గుంకుమరంగుఁ దాల్ప
వీకమైవచ్చి యప్పుండరీకసఖుడు
"రాజపుత్రిక ! పలుకాడరాదు నోరు
సిగ్గుచే మ్రగ్గి యింకేమి చెప్పవాడ.

నీ మనోజ్ఞత గన్న యా నిముసమందె
భవదధీనుండు సూవె మత్ప్రాణసఖుడు
విరహబాధాతివివశుడై వెలది ! నేడు
బ్రతుకుటాశాంచలమ్ములఁ బ్రాకులాడు.

సతతాతిగర్హితంబగు
కృతినైనం దామొనర్చి క్షితి సాధుజనుల్
బ్రతికింత్రు సుహృజ్జనముల
నతనువికారాత్మ బ్రోవ నతివా! తగవే!".

వినయముమీర నట్లని కపింజలుడున్ జనునంతలోననే
దినమణి పశ్చిమాంబునిధితీరమునందున గ్రుంకె, వెంటనే
మునితనయాశ్రమంబునకుఁ బోవ, సరోవరపశ్చిమంపు ది
క్కునఁ జనుదెంచు కొండొకనికూయి వినంబడె కొంతదవ్వులన్.

"తరలికా! యేమిటే?" యంచు నరిగికొంత
"హా! హతోఽస్మి, హా! దగ్ధోఽస్మి!" యనుచు బెక్కు
గతుల విలపించు మునిచెలికాని కంఠ
రవము వింటిని బహుళసంభ్రమము దోప.

అలఁదురు నక్కపింజలు రయంబున డాయగబోవుసప్డు, తో
ట్రిలె పదముల్ గడుంగడు శరీరము డస్సె నెటోగమించి, య
వ్వలతికి జేరి యప్పటికి బ్రాణమువాసిన పుండరీకుఁ గాఁ
గిలిఁగొని కంఠమందు కడుఖేదిలు నెయ్యునిగంటి నక్కటా!

అరసి గ్రహగృహీత యైనట్టి చందాన
"అమ్మరో!" యటంచు నడలియడలి
మరణనిశ్చయమునఁ "దరలికా! రచియింపు
చిదుక లిన్ని దెచ్చి చిత"మటన్న.

వ్యోమపథావతీర్ణుఁడు సితోత్పలగాత్రుఁడు మత్సమీపపున్
సీమకు చంద్రమండలవినిర్గతుఁడై యరుదేరి, 'శ్వేతగా
త్రా! మరలింపు నీతలపు ప్రాణము నిల్పు, పునస్సమాగమం
బీ మునిసూనుతోడ లభియించు' నటంచు వచించి యాతఁడున్.

ఉపరతాయువౌచు నుర్విపై బడియున్న
ముని కుమారచంద్రు తనువు తనదు
బాహుయుగళి నెత్తి పరువెత్తి మింటిపై
సాగిపోయె వ్యోమచారి యంత!

విని భయవిస్మయాత్మతఁ 'గపింజల! యేమిది?' యన్న సంభ్రమం
బున నతఁడున్ 'ఖలా! ప్రియతమున్ గొనిపోయెద వేడ?'కంచు తా
ననుసరణమ్ము జేయుచు వియచ్చరు నంబరవీథిఁ బార, స
త్యనుపమకాంతు వాని పునరాగమనంబు బ్రతీక్షఁ జేసెదన్!

తూరుపుకొండపై నినుఁడు దోఁచిన లేచి, సరోవరమ్మునన్
జేరి, జలావగాహమును జేసి, కమండలువుఁ గ్రహించి, స్వీ
కారము సేసి వల్కలము; కాదని బంధులఁ, ద్రోసి మత్సఖీ
వారము; నక్షమాల గొని, వాసమొనర్తు నిటన్ తపోమతిన్.

“కడు దురపిల్లుదుఁ దరలికాసహితంబుగ నిందు, నెన్న డ
య్యుడుపతి మాటనిక్కమగునో” యనిపల్కెడువేళ కంఠముఁ
విడివడి యా లతాంగియును పెద్దయెలుంగున నేడ్చె, నక్కటా!
కడయెఱుఁగంగరాని మమకారవియోగభరమ్మదెట్టిదో !

ఆ రమణీలలామ వినయాతిశయమ్మును, శీలసంపదా
కార మనోహరత్వములు, గమ్మని పల్కులు, ధర్మదీక్షయుఁ
గారుణికైకబుద్ధి, మృదుగానము, నిర్వ్యపదైకవృత్తియుఁ
సారెకు మెచ్చి గౌరవము చాలగ హెచ్చి నృపాలసూనుఁడుఁ.

అనునయశీతలమ్ము లగునట్టి వచస్సుల బల్కి, రాజమం
డనుఁడు గ్రహించి యంజలిపుటంబున నిర్ఝరవారి, ఖేచరాం
గన వదనేందుబింబమును క్షాళితమున్ బొనరింపజేసియుఁ
‘కనుపడ దియ్యెడన్ తరలికాసఖి యెందుల బోయె’ నంచనన్.

గంధర్వేశ్వరుఁ డైన చిత్రరథుఁడుఁ గాదంబరీ కన్యకఁ
సౌందర్యాతిశయప్రభాఖని, సుధాసౌజన్యవారాశి, నా
నందంబొప్పగ గాంచిమించె మదిరా నామాప్సరోభామినీ
సౌందర్యాపగ నోలలాడి రతిరాట్ శాస్త్రార్థ సంవేదియై.

కాదంబరీకన్య కడుగూర్చు నెచ్చెలి
హృదయంబు లొక్కటై యెసఁగు మాకు
తరుణి నా దీనవృత్తాంతంబు నాలించి
యతిదుఃఖితాత్మయై ప్రతిన సేసె

'ఈ మహాశ్వేత తా నెందాక శోకించు
నుద్వాహ మందాక నొల్ల' ననియె
కర్ణపరంపరాగతమైన యీవార్త
చిత్రరథస్వామి చెవిని బడియె

అరుగ కొన్నాళ్ళు జవ్వన మతివ మేన
రమణమై దోప గంధర్వరాజు జూచి
మంతనము సేసి యంత నమ్మదిర తోడ
గంచుకిని బంచె నా రాకఁ గాంక్ష జేసి.

అరుదెంచి కంచుకి దరిసించి నన్నంత
గురుల వాక్యముల నీ సరణి వినిచె
"కాదంబరీ సఖీకాండంబునం దగ్ర
గణ్యురాలవుగదా పుణ్యశీల !

అది సముపారూఢయౌవన నే డయ్యె
నిచ్ఛగింపదు పెండ్లి నిప్పుడాడ
హే మహాశ్వేత! నీ విచ్చోటి కరుదెంచి
మరలింపవలయు నా తరుణిమనసు"

అనుట నాలించి తరలికఁ బనిచియుంటి
చెలికి కాదంబరికి నిట్లు చెప్పు మనుచు.
"నేను బ్రతుకుట నీ కిష్టమేని సకియ !
గురుల మాటల వెంబడి జరుగు మింక"

ఉదయగిరి ప్రాక రవియు, కేయూరకుండు
దరలికాయుక్తి గంధర్వ దారకుండు;
నాశ్రమంబున కేతెంచె. నంత వినిచె
తరలికాసఖ సందేశహారణచరిత

"కని వచించినాను కాదంబరీదేవి
కీవు చెప్పినట్టి దెల్ల. ఆమె
వినియు వీని తనదు వృత్తాంత మెఱిఁగింపఁ
బంపె ననినఁ బలికెఁ బాలకుండు.

"తరలిక పల్కుమాటల విధం బతిచిత్రము సూవె నెచ్చెలీ!
గురువచనానురోధమొకో? కోపమొ? చిత్తపరీక్షణార్థమో?
ఎఱిఁగెద నంజలించెద గ్రహించెద తావక పాదపద్మముల్
కరుణవహింపు మీ తలపులన్ గలనైన దలంపబోకుమీ!"

అనిన కాదంబరీవాక్కు లాలకించి
సుచిరమాలోచనము సేసి "చూడవచ్చి
యాచరించెద గాక నే నర్హరీతి"
ననుచు నమ్మహాశ్వేతయుం బనిచె వాని.

"రమణీయమైనది రాజపుత్రిక! హేమ
కూటంబు ఖేచరకులగృహంబు
చిత్రరథ పురంబు చిత్రంబు, పేశల
హృదయులు గంధర్వ పృథివిజనులు

ఔదార్యపూర్ణ మహానుభావయు జూవె
కాదంబరీకన్యకాలలామ
అరుదేరి నాతోడ నరసి కాదంబరి
మరునాడు రావచ్చు తిరిగి యిటకు"

అని మహాశ్వేత వచియింప, నధిపసుతుడు
"భగవతీ! దర్శనంబాది భవదధీను
వీని నిక నియోగింపు నీవేడ్కఁగొలది"
అని వచించి ప్రయాణించె నామెవెంట.

అంతట హేమకూట నగరాగతు లౌచు, కుమారికా పురా
భ్యంతరసీమ జొచ్చి- "ఎవ రాతడు? పే రది యేమియా? వయ
స్సెంత? మరిందు రా బనియు నేమిటి?" యంచు బ్రియోపజీవి బ్ర
శ్నాంతరముల్ బొనర్చు నొకచాన సుధానన గాంచి రయ్యెడన్.

అమలాకారము గొన్న సుందరత పోల్పై తోచు కాదంబరీ
ప్రమదా స్మేరసితాననేందు గని చంద్రాపీడ చిత్తార్ణవం
బమితోల్లాసతరంగలాస్యరచనా వ్యాసక్తమై పొంగె న
య్యమృతాంశుప్రభుదర్శనంబునను క్షీరాంభోధి చందంబునన్!

'భూరమణీశనందనుడు పుష్పశరుం డగు వీడుజుమ్ము కే
యూరక వర్ణితుం' డనుచు నువ్విళులూరుచు బెక్కుమారు లా
వారిజగంధి చిత్రరథపార్థివకన్యక వానిఁ జూచుచో
కైరవగౌరహాసమృదుకాంతులు దోచె తదాననంబునన్.

కదలివచ్చికొంత కాదంబరియు స్నేహ
లీల గళముగాఁగలించుకొనిన
శీతలాతిమధురచిత్త మహాశ్వేత
చెలికి ప్రీతి మెరయ బలికె నిట్లు.

'లలనా! భారతవర్ష భూస్థలిని తారాపీడ భూపుండు నా
గల డాతండట గాంచె నందనుని చంద్రాపీడు నాతండు ది
గ్వలయశ్రీవిజయప్రసంగవశుఁడై వాసించి తా జేరె నిం
దుఁలకుఁ మా యెడ హేతుహీనమగుబంధుత్వమ్ము సంధిల్లెపో!

నా యందు వోలె నిమ్మహా
నీయుని యెడ గౌరవమ్ము నెయ్యమలర ల
జ్జాయుతవుగాక మెలగుము
శ్రీయుతబంధుత్వసరణి చెలియా!, యనినన్.

తరుణి సవిభ్రమంబుగను తన్మనుజేశ్వరసూను మ్రొక్కి, క
ప్పురపువిడెమ్ము దా నొసగె ముమ్మొదటన్ కరకంకణక్వణం
బురుతరమై చెలంగ, తెఱపయుఁ మొలకెత్తగ మోమునం దనం
తరమున హంసపుత్రికకు దమ్ముల మిచ్చె లతాంగి నెమ్మిమై.

అంతట నొక్క కంచుకియు నాగతుడై 'తొడితేర బంచె నో
యింతి! నినుం గనుంగొనెడు నిచ్ఛమెయిన్ మదిరాలతాంగి, తత్
కాంతుఁ' డటన్న పల్కువిని గౌరితనూభవ పోయె తత్క్షణం
బంతిపురంబు వీడియును నచ్చోటుకున్ గురులాసచొప్పునన్.

క్రీడాపర్వతరత్నమందిరము నా కేయూరకాఖ్యుండు ముం
దోడై మార్గముసూప జేరి, నృపపుత్రుం డింత విశ్రాంతుడై
చూడంగోరిక పుట్టి యా యుపవనక్షోణీతలం బెల్లనుం
గ్రీడాపర్వతశృంగ మెక్కె వెసఁ నక్షీణప్రమోదాత్ముఁడై.

కడుగారింప దొడంగ నంగజుడు తత్కాదంబరీకన్యయున్
వడి సౌధోపరిభాగ మెక్కినగె చంద్రాపీడు నీక్షించి, య
య్యోషయుం డామెను జూచి నవ్వె, నిటు లన్యోన్యేక్షణాసక్తులై
తడవుంగావు టెరుంగ నేరరు మనస్తత్త్వంబు లజ్ఞాతముల్!

ఆ తరుణంబునఁ 'జలరుహానన ! వచ్చెను వచ్చె నమ్మహా
శ్వేత' యటన్న దర్శకుని పిల్పరుదేరిన లేచిపోయె నాఁ
భీతమృగాక్షి; యంత క్షితిభృన్మణిసూనుఁడు డిగ్గె శృంగముఁ
చేతము లొండొకళ్ళకు వశీకృతముల్ ప్రణయైకభూములుఁ!

స్నానవిధిని దీర్చి సర్వాభిమతదైవ
తార్చనంబు సల్పి, అధిపసుతుఁడు
చిరమనోజ్ఞమైన మరకతోపల వేది
సముపవిష్టుఁడైన సమయమందు

సుందర సుందరప్రచుర శోభనమూర్తిఁ ననల్పకన్యకా
బృంద పరీతమైన మదలేఖను చిత్రరథాత్మజా సఖిన్
చందన చర్చితాంగ గురు సౌరభ మందమరాళయాన నా
నందము మీరఁ గాంచె నరనాథకుమారుఁడు కొంత దవ్వులఁ.

వారిరుహాక్షి యాసరణి వచ్చెడు నప్డనుగమ్యమానయై
హారిదుకూలముల్ గొనుచు నామెకు మార్గము సూపుచుండె గే
యూరక దారకుండు, చెలియొక్కతె పూనె సముద్గకంబు, ము
ద్రారతి మాలతీకుసుమదామము బూనె తమాలికాఖ్యయుఁ.

తరలికాలతాంగి ధవళాంశు కాఛ్ఛాది
తంబు పటలకఁబు దాల్చివచ్చె
అధికకాంతులీను నంతర్ధితంబయ్యె
నందు గలుగు శేషహార మదియు.

ఎదురేగి తోడితెచ్చెను
మదలేఖను భూపసుతుడు మరకత శిలపై
నది విశ్రమించి యించుక
పదపడి సత్వరము లేచి స్వయమునుగ నపుడున్.

చందనమలందె నగపతి
నందనునకు కంకణాక్వాణంబులు మొరయఁ
సుందరవసనాలంకృతు
బొందుగగావించి వైచె బూదండ లొగిఁ

గంధర్వాంగన వెండియు
బంధురతర తారహారభాసుర వక్షు
స్సుందరుని, విస్మయానం
దాందోళితచిత్తు జేసె నవనీశసుతుఁ

మదలేఖయు గాదంబరిఁ
బడియుఁ బదిగావచించె బహుకాల
మ్మది విని రాసుతు డెంతయు
మదిమెచ్చెను దానివెన్క మగువయు చనియెన్.

క్రమముగ న_స్తమించె రవి క్రమ్మకొనెం దమమెల్ల తావులన్
విమలదుకూలపంక్తి పరపించిన గాత్రవవిత్రదిశయ్యె, భూ
రమణకుమారుఁడున్ గడపె రాత్రియదెల్ల క్షణమ్ముపోలికన్
అమృతరసార్ద్రభావకలశార్ణవవీచుల దేలడెందమున్!

సితకాంతి దోప దిక్కుల
కృతసంధ్యావందనుండు క్షితిభృ_త్తనయుం
డతిలోకసుందరాంగిని
స్మితమంజులరాస్య జూడ చేరెన్ నగరున్

మందరసౌధసీమ జని మానవనాథకుమారమౌళి య
య్యిందునిభాస్య నాత్మ హృదయేశ్వరి చిత్రరథాత్మజాతకున్
బంధురమాధురీభరిత భాసురభారతభారతీ రసా
స్పందగతుల్ నిరూపణము సల్పు తదగ్రజగాంచె నంతటన్.

కొంత కాల మచటగూర్చుండి నృపసుతుం
డంతపోవ గోర్కి యవతరింప
కదిసి యల్లనల్ల గాదంబరీదేవి
కిట్లు బలికె బ్రీతి యెసక మెసగ

'పరిజన కథానులాపన
తరుణంబున నన్నొకింత తలపెట్టదగున్
తరుణీమణి! వాచాలుని
నిరసించును లోకమింక నేనేమందున్!'

అతులితరాగస్నిగ్ధము
లలితకటాక్షంబు లామె యంతఃకరణం
బతులవశంకరణములై
క్షితిభృత్సుతు డేగువేళ చిలికెన్ సుధలన్!

అంతిపురమ్మువీడి యత డంతట హంసతనూభవాశ్రమో
పాంతము జేరి, గాంచె నభివందనసేసెడి యాత్మసైన్య మా
ప్రాంతమునందు, వారటకు వచ్చిరి అశ్వఖురానుసారులై
యంతకుమున్న, రాకొమరుఁ డాత్మనివేశము జొచ్చెపిమ్మటన్.

వారిజబాంధవుం డుదయపర్వతసీమ జనించినంత నే
యారకుడున్ మహీశతనయున్ గనవచ్చిన నాతనిన్ ప్రతీ
హారిసమేతునిన్ బ్రథమమందున గన్నుల గౌగిలించి, బా
హా రుచిరోపగూహనసమాదృతి దేల్చెను వాని పిమ్మటన్

అంత నాసీను జేయ స్వోపాంతసీమ
నలినపత్రపుటోద్ఘాటనంబు జేసి
వాడు కాదంబరీసతీ ప్రహిత మైన
చారు మోహనాభిజ్ఞాన చయము జూపి.

దేవా! మీరు ప్రయాణము
గావించినయంత సౌధగామిని యగుచున్
దేవేరి యందు దిరుగుచు
తావకచేష్టావిశేష తత్పరమతియై.

'దేవర యిందు స్నానవిధి దీర్చెను, ఈ శిల గూరుచుండె, ని
చ్చో వృషభధ్వజుం గొలిచె, సొంపుగ భోజన మిందు జేసె, నం
దే వరియించె నిద్ర' నని తేపకు తేపకు బల్కు నెచ్చెలుల్
దేవియు తత్ప్రదేశముల ద్రిమ్మరిజూడ దినాంతమున్ గనెన్.

రవి చరమాద్రినిద్ర గన, గా జుదయింప కపోల పాళి తె
త్కువలయనేత్ర చేయిడి యెదో యొకయించుక చింతజేసి, లే
చి వెస గమించి శయ్యపయి జేరిచి మే ననిమీలితాక్షులన్
తోవలకు దీపపంక్తులకు తోడు ఘటించి తరించె తన్నిశన్.

అతిదుఃఖదుఃఖవతినై
యతివయు రేయెల్ల గడపి యరుణోదయమం
"దతిసత్వరముగ నరుగుము
పతి తోడితె" మ్మంచు నన్ను బంచె కుమారా!

సచివపుత్రుని బిల్చి సైన్యమప్పనజేసి
పత్రలేఖతోడ బయలుదేరి
నృపకుమారు డంత హేమకూటంబున
కరుగుదెంచి యంతిపురము సొచ్చి

మదనచాపమట్లు మన్మథారోపిత
గుణమనోజ్ఞ యైన కుసుమగాత్రి
శ్రీ వసంత మట్లు శిశిరహారిణి యైన
చిత్రరథతనూజ చేరి చూచె.

"ఈ లలితాంగి ఈ ప్రభున కింపు దలిర్పగ సేవసేయు తాం
బూలకరంకవాహిని, ప్రభుండును ప్రీతిగలండు దీన, భృం
గాలక పత్రలేఖ యనగా జెలువొందు" నటంచు సేవకుం
డోలి వచించి యామె నసితోత్పలనేత్రను జూపె దేవికిన్.

'రా రా !' యని కాదంబరి
యా రమణిని జేరజేరి సాదరవృత్తిన్
తోరంపుబ్రేమ తొణికెస
లారగ గూర్చుండజేసె నంతికమందున్

అతిచతురం బధికప్రియ
మతిమధుర కథానులాప మంతఃపురిలో
క్షితిభృత్సుతుండును గౌరీ
సుతయును గావించి రెలమి శ్రుతిహితఫణితిన్.

తరుణీమందిరమంత వీడి వడి స్కంధావారమున్ జేరగా
తురగారోహణసేయు నప్పు డటకున్ దోతెంచి కేయూరకుం
డరుసున్ మ్రొక్కిడి పత్రలేఖ నెలమిన్ వ్యావర్తింతం జేయ సుం
దరి కాదంబరి కోరుచున్న విని యాతండియ్యకోల్తెల్పియున్.

వేలముజేరి వైళము ప్రవేశముసేయుచు జూచె నంతలో
నేలిక వద్దనుండి తనయిక్కకు వచ్చినపత్రహారి భూ
పాలసుతుండు, వాడు నతిభక్తిని మ్రొక్కెడి రెండుగమ్మలా
యేలికబిడ్డ కిచ్చిన గ్రహించి పఠించెను తత్తరమ్మునన్.

"స్వస్తి! కుమారచంద్ర! గుణసాగర! భాసురసంపదాకరా!
స్వస్తి!. సమస్తభూరమణవందితదివ్యపదారవిందుడున్
న్యస్తమహేశ్వరవ్రతు డహార్యమహోజ్జయినీశ్వరుండు లో
కస్తవనీయు నాత్మసుతు గారవమొప్ప శిరమ్ము మూర్కొనున్.

జనులెల్లవారు కుశలురు
కనుగొని నిన్నెందు బెద్దకాలం బరిగెన్
నను గన్నతండ్రి నినుగన
మన మత్యుత్కంఠ దవిలి మసలుఁ గుమారా!

అంతిపురమువార లా దేవితో పాటు
గ్లాని జెందినారు గాన లేఖ
విప్పిజూచుకొన్న వెంటనే పయనమ్ము
సేయుమన్న జాగుసేయకన్న.

'తండ్రి యెట్లు సెప్పె దగ సేయు మారీతి'
ననివచించె సచివు డనుపు లేఖ
నిజపురమ్ము జేర నృపసూనుడశ్వాధి
రోహియైన యంత మోగె భేరి!

మేదినీశసుతుఁడు మేఘనాథు వలాహ
కాత్మజాతు పిలిచి యానతిచ్చె
"పత్రలేఖతోడవచ్చును కేయూర
కాఖ్యు డీవు నిలువు మంతదనుక."

పడతిని వాడుదెచ్చినను పట్టణమీవునుదాని తెమ్మటం
చొడయుడు బల్కి, మంత్రితనయుం దనసేనల మెల్లమెల్లగా
దోడుకొనివచ్చునట్టిపనితో నియమించి, గమించి, చేరె కా
అడవి నొకండు, దాటియది క్రమ్మర మాపటిసందెజామువన్.

రుచిరము రక్తచందనతరూపరిబద్ధము వాతధూతము
రచితనభస్థలం బుహుతరం బగు రక్తపతాకమున్ ప్రసి
ద్ధచరితునిఁ జరద్ద్రవిడధార్మికు నొక్కని చండికాలయ
ప్రచురనివాసి గాంచెను, భవానిని మ్రొక్కెను రాజసూనుడున్

తరణియు నస్తమింపగనె తజ్జననాయకసూను డచ్చటన్
పరిజనకల్పితంబయిన పాన్పుపయిన్ శయనించి లేచి దా
నరుణశుభోదయంబున మహోత్తరసీమలదాటి, కొన్ని నా
ళ్ళరిగిన జేరె నుజ్జయిని నందఱడెందము లుల్లసిల్లగన్ !

కతిపయదివసమ్ములు సన
నతనాభిన్ దెచ్చె మేఘనాథుడు క్షితిభృ
త్సుతుసభకు పత్రిలేఖయు
పతిమ్రొక్కిన నతడు దాని పరిరంభించెన్.

అంత నంతికమ్మునందు నయ్యింతిని
గూరుచుండజేసె గూర్మిదనర
పృచ్ఛజేసెనిట్లు నృపతనూజాతుండు
డెందమందు వలపుసందడింప

'మదలేఖయు, మదిరాసుత
సుదతీ ! గౌరీకుమారి సుఖులౌదుర టే?
ముదితలై తమాలికాదులు?
ముదితా ! కేయూరకుండు ముదితుడౌ? యనినన్.

'దేవ! కాదంబరీదేవి మిమ్ముల బ్రీతి
ససఖీజనమ్ముగా సతముగొల్చు
అంతిపురముపీడి యరుదేర దేవర
దేవి నామోమున దృష్టినిల్పి

వేడినిట్టూర్పులు విడిచి దేవేరియు
పత్రలేఖా! యంచు పలుకరించి
తల్లియు దండ్రియు నెల్ల సఖీజనం
బీవె సుమ్మా నాకు నింకయనుచు.

వల్లభునిప్రీతి నీయందు వరలుకతన
నమ్మహాశ్వేత మదలేఖ లందునైన
నీదుదర్శన మాదిగా నాదుప్రేమ
పాదుకొనబోదు నామాటకాదు కల్ల!

నీకుగాకున్న నేరికే నిర్వచింతు
ఆత్మవేదనాభారమ్ము నతివ! యింక!
అతికులీనను కన్యకోచితముగాని
చాపలము నన్ను పరవశస్వాంత జేసె!

తండ్రి సంకల్పమునకుగా తడయలేదు
తల్లి యొప్పిదమైన సంధిల్ల లేదు
నాచుకొన్నాడు చంద్రుండు నా యెడంద
అతుల గురుగర్హణీయ నేనైతి నకట !

*

*

అని పలికి మౌన మూనిన
'వనితా! తగ దూరడిల్లు వగ జెందకుమా
నినువంటిదాని డెందము
చన దిటు శోకింప, తెత్తు చంద్రాపీడుఁ'

అనిన 'బ్రతుకు నాస యావంతయును లేదు
నిన్ను జూచి తనువు నిల్పుకొందు
నీవు పల్కినదియె నీ నిశ్చయంబేని
అట్టి రీతి సేయు' మనియె దేవి.

ఆపన్నవత్సలత కను
రూపమ్మగు కార్యమగునె ? ప్రోపన దగునే !
ఈ పగిది దేవి నేర్చుట
స్వోపాంతము సేరనీక సొలయుట దేవా !

అని వినుచు సనిర్వేదము
సనయమ్మును సానురాగ సాభ్యర్థనమున్
ఘనతర విరహాలాపము
ననఘాత్ముఁడు చిత్తగించి వ్యాకులపడియెన్.

కతిపయ దివసమ్ములు సన
క్షితిభృత్సుతుఁ జూడవచ్చి కేయూరకుఁడున్
'పతి ! నేను మేఘనాధున
కతివను దోడితెచ్చి యిచ్చి యరిగిన మగుడన్.

దేవరవార లాత్మగురుదేశము వోయిరటంచు దెల్పినన్
దేవికి- హంసపుత్రికయు దీనముఖమ్మున నిశ్వసించి, యెం
తేవగ 'ఇంతియే' యనుచు నేగె తదాశ్రమసీమకున్; సదా
దేవి త్వదర్థవేదనలఁ దేపకు గుందు నెడందయం' దనన్.

'కలతపడంగ నేమిటికి కంజదళాక్షికి మేనఁ బ్రాణముల్
నిలుచుగదా మదర్థమయి, నెచ్చెలిజీవము నిల్పుకోస మ
వ్వలతికిఁ జేరువార మిక వారిజలోచన పత్రలేఖ ముం
గల గొనిపొమ్ము ప్రత్యయముకై వెనువెంటనె నేను వచ్చెదన్.

పరివారము దశపురమున
కరుదెంచిన కింవదంతి యది వినబడె, డ
గ్గరె వైశంపాయనుఁడున్
పరమమ్మగు నీదు కాంక్ష ఫలవంతమగున్'

అని వారి ననిచి పిమ్మట
మనుజేశ్వరనందనుండు మరలినయంతన్
'తనయా! వైశంపాయను
చని తోడితెమ్మంచుఁ బల్కె సచివాగ్రణియున్.

తత్క్షణంబు నంద దశపురమ్మును గూర్చి
యోజనత్రయమ్ము నోలి గడచి
శూన్యదృష్టు లైన సైన్య మారసి ధరా
ధీశతనయుఁ డిట్లు పృచ్ఛ జేసె.

'సచివతనయుఁ డెందు సంచరించెడివాఁడు ?
కారణం బదేమి కానరాఁడు!'
అనిన దీనవదను లగుచు "దేవరచన్న
మరు దినాన భేరి మొరసి నంత.

'అచ్ఛోద కాసార మతి పుణ్యదంబంచు
నిఖిలపురాణముల్ నిర్వచించు
కావున స్నానంబు గావించి సరసియం
దరుగువారము మహేశ్వరుని గొలిచి'

అనిచెప్పి యాతండు చని పాదచారియై
అచ్ఛోద కాసార మంతజేరి
సర్వసీమల దృష్టి సారించి యొకచోట
వరలతామండపం బరసి యరసి

సచివపుత్రుండు నేదియో సంస్మరించు
వానివలె నధోముఖుఁడునై మౌనమూని
నిలిచి యుండున బిల్చినఁ బలుకకున్నఁ
దరలి పోదము రండంచు మరలఁ బిలువ

అతిదృఢనిశ్చయాత్ముఁడయి యాతఁడు 'నేనిటనుండి రాను, ని
ర్గతులగు డీర'లంచు మము రాజకుమారక ! పల్కి మేమునున్
గతియది వేరుగానక దినంబులు మూడట వేచి నిల్చి; మె
ల్లతఁడటరామి గన్గొని నిరాశులమై యరుదెంతు'' మంచనన్.

ఉర్వీనాథతనయుఁ డుద్వేగవిస్మయా
క్రాంతహృదయుఁ డగుచు కటకలోక
సహితుఁడగుచు నంత చనియె నుజ్జయినికి
నవిరతంబు లగు ప్రయాణములను.

పురము వెలికి వచ్చి పౌరిఁబౌరి తనుజూచి
నిస్పృహాత్ము లైన నిఖిల జనుల
కెఱుక బరచె నంత ధరణీశసూనుండు
సచివతనయు దీనచరిత మెల్ల.

అంత పురమ్ముఁజొచ్చి మనుజాధిపసూనుఁ డదృష్టసర్వవృ
త్తాంతుఁ డసక్తచిత్తమున తండ్రికి మ్రొక్కి నధోముఖుండునై
యంతట మంత్రివర్యునకు నంజలిజేసె, తరించి రేయి, భూ
కాంతు ననుజ్ఞ నొంది, చెలికాని యుదంతము నారయన్ జనెన్.

తురగ మధిరోహణముఁ జేసి, త్వరితగతిని
నిద్రయును భోజనమ్మును, నిశలు పగలు
నెండవానలు ననక మహీశసుతుఁడు
బయనముంజేసి తత్సరోవరముఁ జేరె.

తన చెలికాని జాడ లెవి తత్సరసీతటిఁ గానుపింపమిన్
జనియెను రాజనందనుడు చయ్యన హంసతనూభవాశ్రమం
బునకు లతాంగికిన్ దెలియబోలును మిత్రునిజాడలంచు, నం
దునను శిలోపవిష్టయు నధోముఖి యైన వియచ్చరాంగనన్

కని 'ఇదియేమిటే తరలికా!' యని పృచ్ఛ యొనర్ప, హంసనం
దనయు సగద్గదస్వరమునన్ వచియించె 'మహానుభావ! ఏ
మనుదు వరాకి నింక? తమ రాత్మపురంబును జేరువార్తలన్
వినిచిన దర్శకుండు దురపిల్లి తపోమతి నిందుఁజేరితిన్.

ధరణీసురసూనుఁడు సుం
దరుఁ డొక్కఁడు నన్నుఁ జేరి దర్పకవశుఁడై
'వరతను! చిత్రము తప మీ
సరణిని పొనరింతురొక్కొ జగతిని తరుణుల్?

ప్రాయమునకుఁ దగిన పనులనే యొనరించి
నింద తొలఁగియుండుఁ బ్రోనిఖిలజనులు
నీ ప్రయత్న మిదియు నిర్భరాశ్చర్యమై
అతివిభిన్నరీతి నలరు నతివ!

జీవలోక సుఖమ్ముల నీవు రోసి
తపసుచే క్లేశపెట్టెదేల దనువు నిట్లు
వేయునేటికి నెచ్చెలీ! వృథయసుమ్ము
ధను వధిజ్యంబు సేయుట దర్పకుండు!'

అని యెంత నివారణముగఁ
బొనరించిన వినక వెండి మున్మొదటిగతిఁ
ననుఁ బ్రిల్లదంబు లాడినఁ
గినుక మెయిఁ గన్నుదోయి కెంపువహింపన్.

పిడుగేల పడదు నీతల?
వడుగా! నీ జిహ్వ వేయివ్రక్కలు గాదే?
కడుపాపి నిన్ను దైవము
విడువక బాధింప డేల వివిధశ్రమలన్!

ఉపదర్శిత ముఖరాగము
స్వపక్షపాతప్రవృత్త వరకీరముగా
నెపమెంచి నిన్ను సేయుత
మిపు డెవ్వడు వేగిరించె నేతత్ప్రభువుః !

అంత సుధాకరాభిముఖనై 'పరమేశ్వర! లోకపాలకా!
చింతన మన్యపూరుషునిఁ జేయక నిత్యముఁ బుండరీకు మత్
స్వాంతము నందుఁ గొల్చుటది సత్యమయేని అలీకకామి వీఁ
డింతట కీరరూపము వహించెడు' మంటిఁ బ్రిరుష్టచిత్తనై!

ఛిన్నమూల మైన క్షితిజంబు పోలిక
ప్రాణహీనుఁ డగుచు బ్రాహ్మణుండు
ధరణిపడిన నంత పరిజనాక్రందన
నెఱిగికొంటి మీకు హితుఁడటంచు'

అని పలికి సిగ్గుచేతను
వనితామణి మోమువంచి, బహుదుఃఖముచే
జనియించు నశ్రుజలముల
గనుగొనలఁ నిల్పలేక కడిగెఁ బుడమిఁ.

'భగవతి! నీ ప్రయత్నములు భవ్యములైన నపుణ్యభాజనం
బగుట మదీయజన్మ మిది యంగనపొత్తు లభింప దింతకుఁ
దగుగతి ముందుపుట్టువున దత్ఫల మబ్బెడుగాక' యంచు నె
వ్వాగ ధరణీశనందనుఁడు భగ్నహృదంతరు డయ్యె నంతటఁ.

తరలికా లలితాంగి ధరణీశనందను
నంగ వికారమ్ము లరయుచుండ
తిర్యగాభుగ్న మా దేవర వదనమ్ము
గౌరీతనూభవ కాంచుచుండ

'ఓ దుష్టతాపసీ! యొనరించి తిది యేమి?'
టని సేవకశ్రేణి కనలుచుండ
ఎంతేని వగజెంది యింద్రాయుధాశ్వంబు
క్షితినాథసుతుని వీక్షించుచుండ

పత్రలేఖ నివేదింప ప్రభుని రాక
దారి చూపంగ కేయూరదారకుండు
నమ్మహాశ్వేత గన్గొను వ్యాజమునను
రేని గనవచ్చె కాదంబరీ లతాంగి.

ఉద్ధృతామృత మైనట్టి యుదధి వోలె
ముక్తకర్ణిక యైన యంభోజ మట్లు
జీవనోన్ముక్తు డైనట్టి క్షితిపసుతుని
సంభ్రమంబున గాంచె నా చంద్రవదన.

'హా! కిమిద' మ్మని బహుధా
శోకించి శిరమ్మువంచి క్షోణిం బడుచో
వీక మెయిఁ మదలేఖయు
శోకవతిఁ లేవనెత్తి సొలిమిడి దీర్పఁ.

సుచిరకాలమ్మునకు లేచి, సుందరాంగి
కంఠమందు మహాశ్వేతఁ గౌగిలించి
'ఎట్టిదైన ప్రత్యాశ నీ కెలయు సఖియ!
అదియు శూన్యమ్మె చూవె నా' కని వచించి

'ఆహుతిని చేతు దేహమ్ము నగ్ని కనుచు
రమణి! నిను జూతు జన్మాంతరమున' ననుచు
రాజనందను చరణముల్ రాజవదన
కరములం బట్టి తనదు నంకమునఁ దాల్చె.

అతివకరము సోకినంత చంద్రాపీడు
దేహమందు బుట్టి తేజరిల్లె
చంద్రధవళదీప్తి; చదలందు నశరీర
వాణి యొండు వినగవచ్చె నిట్లు.

'ఉమ్మలికంబుఁ జెందఁజన దుగ్మలి! నీ విభు పుండరీకు దే
హమ్మది భూరికాంతిమయమై విలసిల్లెడు త్వత్సమాగమా
ర్థమ్ము మదీయలోకమున, శ్రద్ధమెయిఁ నరనాథసూను కా
యమ్మును శాపదోషపరిహారము గల్గెడుదాక సాకుడీ!

వీని యంతరాత్మ వెలయు మత్తేజస్సు
కానఁ జావులేదు వీని కెపుడు
నమ్మకమ్ము మీకు నామాటలఁ గల్గ
విడిచిపోదు నిందు వీని తనువు'

సోమధవళదీప్తి సోక నింద్రాయుధా
శ్వంబు నెక్కి చనిన పత్రలేఖ
హాయనమేత యగుచు నచ్ఛోదకాసార
జలము లందుఁ గ్రుంకె సరభసముగ.

వారలట్లు మునుక వైచిన యంతలో
సరసిజలము లందు సంభవించి,
తపసితనయుఁ డొకడు తత్తరంబున లేచి,
దూరమందుఁ జూచి గౌరితనయ.

'నను సరిపోల్చుకోఁగలిగినావె లతాంగి !' యటంచు బల్కినన్
'విను మటువంటి పాపిని కపింజల ! కాను, సుహృజ్జనంబులన్
గొనకొని కాదటండ్రె? యదికూడునె? యెవ్విధినీటమున్గి? తె
వ్వని దయ పూర్వరూప మది వచ్చెను నీకు? వచింపగోరుదున్.

పుండరీకు డెందు నుండెడు వాఁడయ్యొ ?
వాని విడిచి యొంటి వచ్చితేల ?
వినదలంతు సర్వవృత్తాంత' మనియన్న
తరుణి కిట్లు బలికె తపసిసుతుడు.

'విను మిటనొంటినిన్ విడిచిపెట్టి వియచ్చరు చాలదవ్వు నే
ననుసరణమ్ము జేసితి, వియత్పథగామియుఁ బుండరీకునిన్
గొనిచని చంద్రలోకమునకున్ శశికాంతమనోజ్ఞశయ్య పై
నునిచె తదీయదేహము మహోదయనామ సభాంతరస్థలిన్.

"హిమకరు డౌట నే నెఱుగుమింక కపింజల! నీ సఖుండు జీవములను కామదోషమునఁ బాయుచు శాపము నాకొసంగె కోపమున 'దురాత్మ! పుట్టు మిక భారతవర్షమునఁ ప్రియాసమాగమ సుఖహీనతఁ బరగి, క్రిమ్మరఁగ్రిమ్మరఁ బుట్టుమా'యనఁ

నిరపరాధి కిట్టి నిరుపమశాపమ్ము
నీ సఖుండు నీయ నేను కినిసి
'నన్నువోలె నీవు నాకష్టసుఖముల
బాలుగొందు' వంచుఁ బల్కి పిదప

అమ్మహాశ్వేత యందు నాకైన ప్రీతి
హితము సేతును గాక నే నితనికంచు
మర్త్యలోకమ్మునం దినుమారుమాత్రి
మితేఁడు నాతోడఁ బుట్ట శపించినాఁడ.

నాశ మందరాదు లేశమైనను గూడ
నితని తనువు శాప మెడయు వరకు
కాన మామకీనకాంతి పోషితుఁ జేయఁ
దెచ్చియుంటి నిందు నిచ్చ కొలది.

శ్వేతకేతు మునికి చెప్పు మీ వృత్తాంత
మతఁడు ప్రీతివిధాన మాచరింప
జాలువాఁడు గాన సత్వరంబేగుమం"
చతఁడు పలికి నన్ను ననిచి నంత

నే నతిదుఃఖ వేగమున నింగినిఁ బోవుచుఁ గానకొక్క వై
మానికు దాటియుం జనెడిమాడ్కి కతండు 'తురంగమంబవై
మానవలోక మందు నభిమానము వాయ జనింపు' మంచు లో
నూనిన కిన్క శాపమిడ నుమ్మలికంబును జెంది పిమ్మటన్.

'శోకపరీతచిత్తుడను చూడక చేసితి తప్పు, ఖేచరే
శా! కరుణించి శాప ముపసంహరణం బొనరింపు' మన్న 'నా
వాకు లమోఘముల్ గనుక వారువమౌటది తప్పనేర' దం
చీ కరణిన్ వచించె నుదయించిన నించుక జాలి నాపయిన్.

'ఎవని వాహనంబ వీ వౌచు జనియింతు
వతఁడు మృతినిఁ జెంది నంత నీవు
జలము లందుఁ గ్రుంక శాపవిముక్తియు
గలుగు నని వచించి పలికె వెండి

అనపత్యతా తాపమునఁ గుంది పొనరించు
నుజ్జయినీశ్వరుం డుగ్రతపము
ఆరేని తనయుఁడై యవతరింపఁగఁబోవు
నుడురాజు ప్రజలెల్ల రుల్లసిల్ల

శుకనాసమంత్రికి సుతుఁడౌచు జనియించు
నీ కూర్చుచెలి పుండరీకు డింక
ఆరాజచంద్రకుమార వాహన మౌచు
నుదయించి సుఖము లొందెదవు గాక'

అనుట వినియు నధఃస్థిత మైన యుదధిఁ
బడియు నందుండి తురగరూపంబు దాల్చి,
వెలికి వచ్చితి; హయరూప మలరుచున్న
పూర్వజన్మ సంస్మృతి యది పొలియ దనిన

'త్వత్సమేత యగుచు పత్రలేఖాంగన
సరసిమునిగి యెట్టి చందమయ్యె?
కరుణ దెలుపు'మన్న కాదంబరికి నంత
వినిచె నిట్టు లా కపింజలుండు.

'తరుణీ జలపాతానం
తరచరితం బెఱుఁగ నేను తత్కథలెల్లన్
అరయంగఁ గోరి యిప్పుడ
సురముని యగు శ్వేతకేతు చూడం జనుదున్.

అధిపసూనుఁ డెందు నవతరించిన వాఁడో
మంత్రితనయుఁ డెందు మనలు వాఁడో
పత్రలేఖ యెందుఁ బరగునో తెలియంగ
పోదు మాని పాదమూలమునకు'

అని వచించి యాత్రఁ డంబరవీధిపై
నెగిరిపోయినంతనే లతాంగి
అధిపసూను తనువు నన్యశిలాస్థలి
నొనర నిలిపి నెడద నోర్పు దాల్చె.

స్నానమొనరించి, దేవతార్చనము సేసి,
దివము నిశయు నిరాహారదీక్ష గడపి,
రాజపుత్రుని దేహమ్ము రమణి యుదయ
సమయ మందున పాణిసంస్పర్శ దేల్చె.

అంతటన్ గపింజ లో వేదితం బైన
'శాపవృత్త మెల్ల సత్య మగుత!'
మనుచు నంతరాత్మ యందు సంతుష్టయై
కూరుచుండె కుసుమకోమలాంగి.

పెద్దకాలంబు గతియించె ప్రియతనూజు
డేల రాడన్న యారాట మెడద గలుగఁ
దెలియ గాంక్షించి పంపె సందేశహారుల
తనయు వృత్తాంత మరయగా ధరణివిభుఁడు.

దళపతి మేఘనాధు గని తత్పరివారము గాంచి యంత న
య్యలఘుగుణాఢ్య 'భద్రముఖులార! కనుంగొనినారలొక్కొ మీ
రొడయుని మోము పూర్వమటు లున్నదిగా, యిక నేగి సత్యమున్
దెలుపుడు మీరు సూచినది దేవర కంచు వచించి వెండియున్.

త్వరితక నామధేయుఁ డగువానిఁ గుమారక బాలసేవకున్
'బరుగున వీరివెంటజని పార్థివచంద్రుని తోడ సత్యపున్
తెర గెరిగించి ర'మ్మనుచు దేవి వచించిన వాఁడు పోయి, త
ద్ధరణిపు తోడ నిట్లని యథార్థకథాకథనంబు సల్పెదున్.

'వసుమతీశ్వర ! భయ మందవలదు, స్ఫటికత
హృదయుఁ డయ్యెను యువరాజు ధృతశరీరి.
శాపవశత చంద్రాపీడ సచివతనయు
లీ భవమ్ములఁ బడు వెత లింక వినఁడు'

అని తదద్భుత చరితమ్ము నతఁడు వలుక
నిరవశేషంబుగా విని నెమ్మనమున
'నాకు జీవితసంధారణమ్ము సేయ
నందు జనుకంటె వే రుపాయమ్ములేదు'

అని తలంచి నృపతి ఆత్మీయ కాంతతో
సచివుతోడ సతని సకియతోడ
నరిగి చేరె నంత నచ్ఛోద కాసార
మవిరతంబు లగు ప్రయాణములను.

అంతట వారిరాక విని హంసతనూభవ సిగ్గుచే గుహా
భ్యంతర సీమఁ జొచ్చె, మదిరాత్మజ మూర్ఛను జెందె, నల్లవ
స్థాంతరు లౌట వారు, సచివాగ్రిణి భూరమణుల్, తదీయ సీ
మంతిని రాజవల్లభఁ, గ్రమంబున నాశ్రమసీమఁ జేర్చినన్.

సర్వయత్నములను చాలించి సుప్తిని
జెందు వాని బోలి నందనుండు
నుర్వి వ్రాలియున్న నుజ్జీవితుం డంచు
దలఁచి యాశ్రమమున నిలిచె నృపతి.

'ఎవఁడు కామోపహతబుద్ధి నవినయప్ర
వర్తనముసేసి, దేవతాపదము వాసి;
జగతి శుకనాస సూనుఁడై జన్మ మెత్తె
వెండి యాతండె వ్యామోహ విగతబుద్ధి

కాఱు లాడినంత కనలి మహాశ్వేత
శాప మిడిన కీరజాతిఁ బుట్టె'
అని వచించువేళ మునిరాజు జాబాలి
అఖిలకళలు నిల్చె నాత్మరసన !

పొలిచినంత రసన పూర్వజన్మవృత్త
సర్వవిద్య లట్లు జనన మందె
హంసుతనయ యందు నైన రాగాదిక
స్మరణ లెల్ల నాదు స్వాంతసీమ !

'రసపారవశ్య బలమున
నిసి గడచుట లగ్ని వేళ నెఱి పొడముట లా
కస మందు నినుఁడు దోచుట
లిసుమంతయు నెఱుగ' నంచు ఋషి లేచి చనెన్.

ఆ కపింజలుండు హారీత సహితుఁడై
యరుగుదేరఁ జూచి యతనితోడ
'కుశలమున్న తండ్రి! కుపితుండె? నా వృత్త
మెరిగి యేమి బలికె గురు' డటన్న.

'అనుఁగు చెలిమికాడ! అఖిలవృత్తాంతంబు
దివ్యదృష్టి వలనఁ దెలిసి గురుఁడు
ప్రతివిధానకర్మ ప్రారంభమును జేసె
తురగభావ మంత తొలగె నాకు!

అంత సురమునీంద్రు నాశ్రమ వాసినై
యున్న నన్ను నేటి యుదయవేళ
చనవు మీరఁ బిల్చి "జాబాలి యాశ్రమ
వాసి యైన వాఁడు నీ సఖుండు

పొడమె వానికిపుడు పూర్వజన్మస్మృతి
యందువలన నరిగి యరసి వాని
నస్మదీయమైన యాశీస్సు లందిచ్చి
తెలుపు మయ్య నాదు పలుకు లిట్లు.

'కర్మపరిసమాప్తి కల్గునందాక జా
బాలి యాశ్రమంబు వదల జనదు'
అని వచించె గురుఁడు నంబయు నీ మీఁది
నెనరు చేత మిగుల వనట జెందె.

తాపసేంద్రు చేయు తత్కర్మయం దుప
జీవినీ ప్రవృత్తి సెలఁగు చుండి
ఆమె నీదు మూర్ధ మాఘ్రాణమును జేసి
పదియుఁబదిగ నాకు సదె వచించె"

వచనకరుఁడు వినయపరుఁడు మహాత్ముఁడు
బహుకృతజ్ఞబుద్ధి పరమశాంతుఁ
డటు వచించి యప్పు డంతరిక్షంబుపై
నెగిరిపోయె నా కదృశ్యుఁ డగుచు!

కతిపయ దివసములకు ను
త్పతనము గావించు శక్తి వచ్చిన గౌరీ
సుతఁ బోయి చూతుఁగాకని
యతులిత సమ్మోహనిశ్చయాత్ముఁడ నగుచున్.

పరమకౌతుకమున ప్రాతర్వ్యాహారంబు
వ్యోమవీథి సలుపు చోక్కనాఁడు
నుత్తరాశఁ బట్టి యొకకొంత దవ్వేగి
యలసి విశ్రమించి యరుగనెంచి.

కొలని యొడ్డు నందు జెలువొందుచున్నట్టి
యవనిజాగ్ర మొందు నాశ్రయించి
యలపు సెంది యుంట నట్టె నిద్దురపట్టి
చాలకాలమునకు మేలుకొంటి.

అరసినాడ నంత నాత్మదేహము తంతు
పాశబద్ధ మగుట, పాశరహిత
కాలభటుని వోలి క్రాలెడు నొక్క చం
డాలమృగయు నాదు మ్రోలఁ గంటి.

పక్కణంబునకును వాఁడు గైకొనిపోయి
చూపె నన్ను నొక్క సుందరాంగి
కామె 'ప్రాప్తమైతివా పుత్రకా !' యంచు
నగుమొగమ్ము తోడ నన్నుఁ బలికె.

దారుపంజరమునఁ జేరిచి నన్నంత
గడియవైచి, యొక్క గడియసేపు
మౌనమూని నామె, ప్రాణపరిత్యాగ
బుద్ధి పొడమి మౌనముద్రఁ గొంటి.

ఉపవసించినాఁడ నుపనీతపానాశ
నమ్ము లించుకేని నాఁడుఁ గొనక.
అపరదివస మందు నశనకాలము మించి
పోవుచున్న వేళ నా వెలంది.

సురభి సుశీతలోదకము సొంపగు పండ్లను దెచ్చి 'ఎందుకీ
నిరశనదీక్ష క్రుంగెదవు నీ వవిచారత ? క్షుత్పిపాసలన్
దొరకిన దాన దీర్చుకొని తుష్టిగొనున్ బహుపక్షివర్గ మి
త్తెరగున వానికిన్ బలువుతిండి లభించునె కాంక్ష సేసినన్!'

సాదరోక్తు లిట్టు లాయమ్మ వచియింప
విస్మితాత్ముఁడను వివేకి నగుచు
నడప క్షుత్పిపాస లాహారముం గొని
మానసైతి నాదు మానవృత్తి!

అరిగిన కొన్నినాళ్లటుల నంతట నొక్కదినంబు నందు భా
స్కరు డుదయింప మేల్కొనుచు గాంచితి గాంచనపంజరంబులో
వరలుట నేను. అందమగు పట్టణముంగని 'ఏమిటంచు త
త్తరము కుతూహలమ్ము పడి తద్గతి నారయ మానవృత్తినై.

కువలయనాథ! మీ కొలువుకూటము సేర్చిన దంత నన్ను నీ
కువలయనేత్రి, దీని కత కొంచె మెఱుంగను, ఎందుకోస మీ
ప్రవిమల మంగళాంగి నను బంధితుఁ జేయుచు నిందు దెచ్చెనో
అవగతమింత కాదు విదిశాధిప!' యంచు శుకమ్ము వల్కఁగన్.

అది విని శూద్రకేశ్వరుడు హర్షకుతూహలమానసుండునై
మదవతి తోడి తెమ్మనినమాత్రన తెచ్చెను సేవకుండు న
మ్ముదితయు 'వింటివే! భువనభూషణ! భూపతి! రోహిణీపతీ!
కథనము సేయ వీఁడు తనగాథ భవత్కథ. ఇంపు పుట్టగన్.

ఇతని కేను జనని నిందిరాదేవిని
ఈ భవమ్ము నందు నితఁడు మరల
వలపులాడి కొరకుఁ బయనమ్ము సేయంగ
దివ్యదృష్టి నరసి దేవమునియు.

'వినయహీను డెప్పు డనుతాప మొందక
తొలగ నేర డతని దొసగు నుండి
కర్మపరిసమాప్తి కల్గెడు నందాక
సాకు మితని మర్త్యలోక మందె!

అనుతాపము నెందిన తత్
క్షణమున విడువంగవలయు గమలా!' యనుచున్
నను బనుపుసేసె వీనిని
వినిబద్ధు నొనర్చియుంటి వినయము గఱపన్!

శాపావసాన సమయము
ప్రాపించెను వీని కర్మ పరిపూర్తి గనన్
భూపాలచంద్ర! మీరలు
శాపానంతరము నందు సమసుఖవంతుల్!

త్వత్సమీపమునకు తత్కారణమ్ముచే
వీనిఁ దెచ్చియుంటి మానవేంద్ర!
జగతిఁ దొలఁగియుండఁ జండాలజాతిలో
ప్రిభవ మంది యుంటి ప్రిభువతంస!

జనన మరణ జరావ్యాధి సంయుతములు
దుఃఖబహుళ దేహంబులఁ దొఱగి మీర
లిష్టజన సమాగమసుఖం బింక ననుభ
వింపు' డని చెప్పి సుదతి ద్యోవీథిఁ జనియె.

పూర్వజన్మమందుఁ బుడమిపై బడియున్న
తనదు తనువు గూర్చి తలచి నంత
కాయ మెల్లఁ గాల్చు కామానలంబును
అవనిపతి యెడంద రవులజొచ్చె!

పుండరీకాత్మయగా మంత్రిపుత్రు డంత
గౌరిసుత యందు గల్గు నుత్కంఠ వలన
నవనిపతి వోలె నా రతీధవుని చేత
నింతయని చెప్పగారాని యిడుమ నందె.

సురభిమాసమ్ము సనుదెంచె, సుమచయమ్ము
పరిమళమ్ముల విరజిమ్మె; నిరుపమాన
సుందరము లౌచు సుమలతల్ కందళించె
ప్రేమమయ మౌచు దోచె ధాత్రీలలామ!

ఆ మధుమాస శోభలకు నాకులపాటును జెంద డెందముల్
కోమలగాత్రి చిత్రరథు కూతురు కొండొక సందె జామునన్
ప్రేమభరమ్ముచే విభునిగ్రీవము గట్టిగఁ గౌగిలింప తత్
స్వామి సచేతనుం డగుచు చందనగంధికి ప్రీతి నిట్లనున్.

'భయము నెందవలదు పంకేరుహాననా!
కంఠసీమ నీవు కౌగిలింప
మఱల బ్రతికినాడ మగువ! రెండవసారి
విగతశాపవృత్తి వెలసె దీన.

శూద్రకాఖ్య తనువు సుందరీ! విడనాడి
నీకుఁ బ్రియము నైన నృపకుమార
మూర్తి దాల్చినాడ ముదిత! హంసాత్మజా
వల్లభుండు శాపవర్జితుండు'

అని వచించి చంద్రాపీడు తనువు నందు
చంద్రముడు నిల్చె, నంతరిక్షంబు నుండి
ఆ కపింజలు కరమునం దాత్మపాణి
పుండరీకుండు గీలించి పుడమిఁ జేరె !

హంస చిత్రరథుల నానందవారాశి
వీచు లందు దేల్చ వెడలె నంత
హేమకూటమునకు నెలమిఁ గేయూరక
దారకుండు వ్యోమచారి యగుచు.

మదలేఖ విలాసవతీ
పదముల పై నృపతి పాదపద్మంబుల పై
నుదురాన మ్రొక్కి 'దేవా !
బ్రదికెను యువరా జదృష్టవంతులు మీరల్ !'

అని వచింప నృపతి హర్షాంబునిధి దేలి
సుతుడు వెలయుచున్న చోటి కరుగ
జనక చరణసరసిజముల చంద్రాపీడు
డొఱగి మొఱగె భక్తిపరవశమున.

చెలువుమీఱ శిరము చెక్కిలి ముద్దాడి
చుంబనంబు చేసి సుతుని నుదురు
బిగ్గ కౌఁగిలించి ప్రియనందనునిఁ దేల్చె
లాలనముల నవ్విలాసవతియు!

మంత్రివర్యుఁ డైన మహనీయు శుకనాసు
మరల మరల మ్రొక్కె మహిపసుతుఁడు.
పుండరీకుఁ జూపి భూనాథపుత్రుండు
ధరణిపతికి సచివదంపతులకు

'మన వైశంపాయను డిత'
డని చెప్పిన సంతసించి రందఱు మదిలో
క్షణమట్లు గడచె నమ్మయి
ననుకొనకయె నాటిరేయి యది వారలకున్!

ఆ తొలిసంజవేళ కట హంసుఁడు చిత్రరథుండు జేరి, త
చ్చేతము లుల్లసిల్లగ విశిష్టసమస్తకథానులాప సం
భూతమహోత్సవంబులను బొద్దులఁబుచ్చిరి మంత్రివర్యుడున్
భూతలనాథుడున్ దమకు భూరిసమాదరణమ్ము జూపగన్.

క్షితిపతనూజు తోడుకొని చిత్రరథుండును హేమకూట మం
చితగతిఁ జేరి సంతసము చెల్వము మీరఁగఁ బెండ్లి జేసె త
త్సుతకును రాజపుత్రునకు సుందరి డెందము గందళింప, రా
జ్యతరుణిఁ గూడ కాన్కయిడె నల్లునకున్ బరమాదరమ్మునన్.

ఆతరి వేడ్కమీరగ వియచ్చరనాథుఁడు హంసుఁ డమ్మహా
శ్వేతకు బుండరీకునకుఁ బెండిలిఁ జేసె మహోత్సవమ్మునన్
ప్రీతి స్వకీయ రాజ్యపదవీ రమణీయ సువర్ణపీఠి జా
మాతృవశమ్ముఁ జేసె గుణమంజులు డాతఁడు తృప్తచిత్తుఁడై.

కడు విషణ్ణ యగుచు కాదంబరీదేవి
నాథువదన మొక్కనాడు జూచి
'ఆర్యపుత్ర! ఎచట నా వరాకి చరించు
పత్రలేఖ కంటఁబడ' దటన్న.

'రోహిణీ లతాంగి మోహినీ! ఆ లేమ
చంద్రలోక మందు సంచరించు
శాపగతుని నన్ను సంసేవనము సేయ
పత్రలేఖ యగుచు ప్రభవ మందె.

ఇచట మరల నేను నింకొక్క జన్మంబు
నందవలసి యూమె త్యక్తయయ్యె.
చంద్రలోక మేగి చరియించు నయ్యంతిఁ
జూడవచ్చు నచట సుదతి!' అనియె.

శ్వశురగృహము నందు దశరాత్రములు నిల్పి
నృపకుమారు డంత నిజపురమ్ము
చేరి రాజ్యలక్ష్మి చెలి పుండరీకున
కప్పనంబుఁ జేసె నొప్పమీఱ!

ఉజ్జయినీవాస మొనరించు కొన్నాళ్లు
ఆత్మీయ దేశమం దైన రక్తి
హేమకూటంబునం దెసలారు కొన్నాళ్లు
గంధర్వరాజుపై గలుగు ప్రీతి

చంద్రలోకమునందు చరియించు కొన్నాళ్లు
రోహిణీరూప ప్రలోభ బుద్ధి
అచ్ఛోద సీమయం దలరారు కొన్నాళ్లు
పుండరీకుని యందు పొసగు మైత్రి

సుందరములైన యాయాయిచోటు లందు
నెల్ల వేళల సంప్రీతి మెసక మెసఁగ
రమ్యకాదంబరీ చిరపరిణయమధుర
పాశబద్ధుఁడై మెలఁగు పృథ్వీశసుతుడు.

చంద్రాపీడుఁడుఁ బుండరీకుఁడు విలాసప్రేమమాధుర్య ని
స్తంద్రిల్ పొందిరి సర్వసౌఖ్యములు, శశ్వత్సాధు కాదంబరీ
సాంద్రప్రేమము హంసరాజతనయా సాంగత్యసంపత్తి రా
జేంద్రత్వమ్ము పరస్పరావిరతియుఁ హేలాగతిఁ గొల్వఁగ !

*

| తప్పు | ఒప్పు | పుట | పంక్తి |
|---|---|---|---|
| వింధ్యాటవిఁ | వింధ్యాటవి | ౫ | ౧౫ |
| శాల్మలీ | శాల్మలీ | ౯ | ౬ |
| అపగతాసూన | అపగతాసుల | ౧౦ | ౭ |
| రాకృతిఁ | రాకృతి | ౨౬ | ౧౨ |
| మూర్తిఁ | మూర్తి | ౩౯ | ౯ |
| బహుకాల | బహుతరకాల | ౪౧ | ౨ |
| లలిత | లతిప | ౪౨ | ౧౦ |
| వ్యావర్తింతం | వ్యావర్తితం | ౪౫ | ౧౫ |
| లేచిదా | లేచితా | ౪౫ | ౨ |